సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 22 । మార్చి । 2025



ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి
కేఎస్ఆర్టీసీ బస్ డ్రైవరు రాంగ్ రూట్లో వచ్చి ఏపీఎస్ఆర్టీసీ బస్ డ్రైవరుపై దాడికి పాల్పడ్డాడు. బెంగళూరులో ఈ ఘటన చోటు చేసుకుంది.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహర్ ఆది॥ (ఉ॥)
కడప	6.31	5.03
పులివెందుల	6.33	5.08
ప్రొద్దుటూరు	6.32	5.07

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.4/24.1

జిల్లాలో శుక్రవారం 39.4 - 24.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైఎస్ జగన్ పర్యటన రద్దు
రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరులో ఈనెల 23వ తేదీన జరగాల్సిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన రద్దయింది. ఈ విషయాన్ని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. మళ్లీ పర్యటన ఎప్పుడు ఉంటుందో త్వరలో తెలియజేస్తామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు
ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ టీటీడీ అధికారులు లెక్కించారు.నెలరోజులకు రూ.4,55,140 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రశాంతంగా పది పరీక్ష
కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 161 సెంటర్స్‌లో రెగ్యులర్‌కు సంబంధించి 27924 మంది విద్యార్థులకుగాను 27786 మంది హాజరుకాగా 138 మంది గైర్హాజయ్యారు. అలాగే ప్రైవేటు విద్యార్థులకు 13 మందికిగాను 10 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా 13 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 90 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఏకగ్రీవ ఎన్నిక



హనుమంతునాయుడికి ధ్రువీకరణ పత్రాన్ని అందచేస్తున్న ఎన్నికల అధికారి సురేష్‌కుమార్

రాజంపేట: రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది పచ్చా హనుమంతునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల సీఈవో సురేష్ కుమార్, సహాయ ఎన్నికల అధికారి గోవర్ధన్ రెడ్డి శుక్రవారం ధ్రు వీకరణపత్రాన్ని అందచేశారు. బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా జాఫర్‌బాషా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, న్యాయవాదులు నాసరుద్దీన్, గడికోట రామచంద్రయ్య, రామచంద్రరాజు, నలికిరిరెడ్డయ్య పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వీసీ అల్లం శ్రీనివాసులకు అభినందనలు తెలుపుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయాన్ని అందరి సహకారంతో అత్యున్నత విద్యాసంస్థగా తీర్చిదిద్దుతామని ఆచార్య అల్లం శ్రీనివాసులు పేర్కొన్నారు. నెల్లూరు విక్రం సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న ఆయన వైవీయూ ఇన్చార్జీ వీసీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఆచార్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులతో భేటీ అయ్యారు.

డ్రైవర్లతోనే సంస్థ పురోభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: డ్రైవర్ల కారణంగానే ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధిలో పయనించగలదని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. తొలుత ఓం శాంతి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంకు చెందిన అక్కయ్యలు మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం ప్రక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీకి ప్రమాద రహిత సంస్థగా గుర్తింపు ఉందన్నారు. ఆ గుర్తింపును అలాగే కొనసాగించేందుకు డ్రైవర్లు ప్రధానపాత్ర పోషించాలన్నారు. ప్రయాణీకులను క్షేమకరంగా సకాలంలో గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. అనంతరం కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ పై సూచనలు సలహాలు ఇచ్చారు. అలాగే బ్లాక్ స్పాట్ పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

ఇటు కేసీ.. చూడండి!

- నీటి విడుదలపై సందిగ్ధం
- అయోమయంలో 20 వేల ఎకరాల ఆయకట్టు రైతులు



కేసీ కెనాల్

కడప సెవెన్‌రోడ్స్: కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని పంటలకు అవసరమైన సాగు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. కుందూనదిలో నీటి ప్రవాహం ఉంటేనే నీరిస్తామని, లేదంటే తాము చేయగలిగింది ఏమి లేదంటూ కేసీ కెనాల్ ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలోనే స్పష్టం చేశారు. ఏప్రిల్ 15వ తేది వరకు నీరిస్తే తప్ప పంటలు చేతికి రావని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమవుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో కనీస నీటి మట్టాన్ని నిర్వహించలేని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ఇందుకు కారణమని విమర్శిస్తున్నారు.

- జిల్లాలోని కేసీ కెనాల్ ఆయకట్టులో రెండవ పంట సాగు చేసుకుంటే నీరందిస్తామంటూ డిసెంబరులో ప్రాజెక్టు కమిటీ సభ్యులు మైదుకూరులో నిర్వహించిన రైతుల సమావేశంలో హామీ ఇచ్చారు. దీంతో కోటి ఆశలతో రైతులు పంటల సాగుకు ఉపక్రమించారు. సుమారు 20 వేల ఎకరాల్లో వరితోపాటు వివిధ ఆరుతడి పంటలు సాగు చేశారు. పంటలు పూర్తిగా చేతికి అందాలంటే ఏప్రిల్ 15వ తేది వరకు సాగునీరు అవసరం ఉందని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఎకరాపై సుమారు 50 వేల రూపాయల వరకు ఖర్చు చేశారు. పంట చివరి దశలో ఉన్నప్పుడు నీరందకపోతే జిల్లాలోని కేసీ ఆయకట్టు రైతులు సుమారు రూ. 100 కోట్లు నష్టపోవాల్సి వస్తుంది.

శ్రీశైలం నీటి మట్టం నిర్వహణలో వైఫల్యం

ఈ యేడు కృష్ణానదిలో వరద ప్రవాహం వంద రోజులపాటు కొనసాగింది. శ్రీశైలంలో 854 అడుగుల నీటి మట్టం ఉంటేనే రాయలసీమ ప్రాజెక్టులైన గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగతో పాటు కేసీ కెనాల్‌కు పోతిరెడ్డిపాడు ద్వారా సాగు నీరు అందించేందుకు అవకాశం ఉంటుంది. తొలి నుంచి తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం ఎడమగట్టు కాలువ వద్ద నిరంతరం విద్యుత్‌ఉత్పాదన సాగిస్తూనే ఉంది. దీంతో వచ్చిన నీరంతా కిందికి వెళ్లిపోతున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గుడ్లప్పగించి చూడడం తప్ప నిలువరించిన పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగానే శుక్రవారం నాటికి శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 837.80 అడుగులు (58.59 టీఎంసీలు) ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి నెలకొందని రైతులు మండిపడుతున్నారు.

ఏప్రిల్ 15 వరకు నీరివ్వాలి



ప్రాజెక్టు కమిటీ హామీ మేరకే కేసీ ఆయకట్టు రైతులు పంటలు సాగు చేశారు. ఈ పంటలు కాపాడటం కోసం ఏప్రిల్ 15 వరకు నీరివ్వాల్సిన అవసరం ఉంది. కుందూలో నీటి ప్రవాహం ఉంటేనే తాము ఇవ్వగలమంటూ ప్రభుత్వ అధికారులు చెప్పడం తగదు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ముందస్తు ప్రణాళిక లేకపోవడమే ఈ దుస్థితికి కారణం. ముచ్చుమర్రి లిఫ్ట్ లేదా వెలుగోడు నుంచి నీటి విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– అచ్చుకట్ల కరీముల్లా, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు, ఖాజీపేట

మైలవరం నుంచి నీరివ్వాలి



కడప-చెన్నూరు ప్రాంత కేసీ కెనాల్ ఆయకట్టులో సాగు చేసిన పంటలను రక్షించేందుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మైలవరం రిజర్వాయర్‌లో అవసరమైన నీటి లభ్యత ఉంది. అక్కడి నుంచి పెన్నా ద్వారా నీటిని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వరకు తీసుకొచ్చి కేసీ ఆయకట్టుకు ఇవ్వాలి. ఈ విషయాన్ని తాము కేసీ కెనాల్ అధికారులను కోరగా, మైలవరం తమ పరిధిలో లేదని, కడప చీఫ్ ఇంజనీరు పరిధిలో వస్తుందంటున్నారు. ఈ విషయంలో కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని కడప చీఫ్ ఇంజనీరుతో మాట్లాడి మైలవరం నుంచి నీరు విడుదల చేయాలి.

– ఎస్.రవిశంకర్‌రెడ్డి, కార్యదర్శి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ, కడప

ముచ్చుమర్రి లిఫ్ట్, మైలవరం నుంచి నీరివ్వాలని డిమాండ్

మైదుకూరు, చాపాడు ఛానల్స్‌కు తెలుగుగంగలో భాగమైన వెలుగోడు రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వెలుగోడులో 4.4 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ అర టీఎంసీ నీటిని మళ్లిస్తే సరిపోతుందని రైతులు అంటున్నారు. శ్రీశైలం వెనుక జలాల్లో ఏర్పాటు చేసినా ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి 750 క్యూసెక్కులు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నా సరిపోతుందంటున్నారు. అయితే ముచ్చుమర్రి నుంచి లిఫ్ట్ ద్వారా ఇస్తున్న నీరు నంద్యాల జిల్లా చివరి ఆయకట్టు ప్రాంతమైన ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి ప్రాంతాలకే సరిపోతుందని అధికారులు అంటున్నారు. పైగా కుందూ నీటిని మోటార్ల ద్వారా ఎగువ ప్రాంతరైతులు మళ్లించుకునే అవకాశాలు ఉన్నాయని అధికారుల అభిప్రాయం. ఇకపోతే కడప, చెన్నూరు ఆయకట్టుకు మైలవరం నీటిని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట ద్వారా అందించాలని రైతులు కోరుతున్నారు.



ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట

పంటలు కాపాడండి సారూ!

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యుల వినతి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని కేసీ కెనాల్ కింద రైతులు సాగు చేసిన పంటలకు నీరిచ్చి కాపాడాలని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా కోరారు. శుక్రవారం జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద అధ్యక్షతన నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల వరకు కేసీ కెనాల్ కింద రైతులు వివిధ పంటలు సాగు చేశారని తెలిపారు. వచ్చేనెల 15వ తేది వరకు సాగు నీరు అందితే తప్ప పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. కొండపేట కాలువ పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. ఇందుకు కేసీ కెనాల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు చిన్న పుల్లయ్య బదులిస్తూ కుందూనదిలో నీరున్నంత వరకు కేసీ కెనాల్‌కు సాగునీరు అందిస్తామన్నారు. వెలుగోడు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 4.4 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. మైలవరం నుంచి నీరు విడుదల చేసే అంశం తమ పరిధిలో లేదని, కడప చీఫ్ ఇంజనీరును సంప్రదించాలని సూచించారు.

- వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ మండలంలో వివిధ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని తెలిపారు. బోర్ల డీపెనింగ్, ఫ్లషింగ్, అవసరమైనచోట తాగు నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఇంతకుముందు తాగునీటి రవాణాకు సంబంధించిన బిల్లులను ఇంతవరకు చెల్లించకపోవడం విచారకరమన్నారు.
- పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు నిర్మాణం కోసం గతంలో టెండరు పిలిచారని తెలిపారు. ఫలానా స్థలంలో బస్టాండు నిర్మించాలని కూడా అధికారులు సూచించారన్నారు. కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి అధికారులు చూపిన స్థలంలో రెండున్నర లక్షలు ఖర్చు చేసి గ్రావెల్ తోలాడని చెప్పారు. తీరా ఇప్పుడు ఆర్టీసీ బస్టాండు నిర్మించాల్సిన స్థలం అది కాదని అధికారులు చెప్పడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం నవంబరు నుంచి దరఖాస్తు చేసుకున్న వితంతువులకు పెన్షన్ మంజూరు చేస్తామంటోందని, అంతకుమునుపు దరఖాస్తు చేసుకున్న వారికి కూడా పెన్షన్‌మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, పలు మండలాల జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లాలో నగరవనం, ఎకో పార్క్‌ల అభివృద్ధికి కృషి
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి కాశినాయన క్షేత్రం పునరుద్ధరణ ఆదేశాలు ఇంకా రాలేదు
- విలేకరుల సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ కడప జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా నర్సరీలలోనూ, రైతుల పొలాలలోనూ అటవీజాతి మొక్కలను పెంచి సంపదను మరింత అభివృద్ధి చేస్తామని జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్‌కుమార్ అన్నారు. కడపలోని డీఎఫ్ఓ కార్యాలయంలో శుక్రవారం (మార్చి21)ను నేషనల్ ఫారెస్ట్ డే సందర్భంగా వినీత్ కుమార్ మాట్లాడారు. మొక్కలను నాటడమే కాదు, వాటిని నాటిన తర్వాత ఎదుగుదల గమనించడం ముఖ్యమన్నారు. అడవులను కాపాడడానికి అందరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని నగరవనాలు, ఎకో పార్కుల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఆయన వివరించారు. కడప నగరవనాన్ని రూ. 2 కోట్ల వ్యయంతో.. ప్రొద్దుటూరులో ఎకోపార్క్‌ను రూ. 84 లక్షలతో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. గండికోట-మైలవరం మధ్యలో వున్న పొన్నతోటలో నగరవనం ఏర్పాటు చేయనున్నామన్నారు. బద్వేల్ పరిధిలో సెంచురీ ప్లైవుడ్ ఫ్యాక్టరీ సమీపంలో మరో నగరవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు 'కడప నేటివ్ ఫారెస్ట్ రెస్టోరేషన్ ప్రాజెక్ట్' పోస్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్, బద్వేల్ సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద, కడప ఎఫ్ఆర్ఓ ప్రసాద్, పోరుమామిళ్ల ఎఫ్ఆర్ఓ రఘునాథ రెడ్డి , ప్రొద్దుటూరు ఎఫ్ఆర్ఓ హేమాంజలి ఇతర అటవీ అధికారులు పాల్గొన్నారు.

ఆదేశాలు రాలేదు..

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కాశినాయన క్షేత్రం పునరుద్ధరణ ఆదేశాలు ఇంకా రాలేదని ఓ ప్రశ్నకు డీఎఫ్ఓ సమాధానమిచ్చారు. కాశినాయన క్షేత్రం పరిధిలో రిజర్వ్‌ఫారెస్ట్‌కు సంబంధించి నిబంధనలను అమలుచేసేందుకు నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డ్, కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాల మేరకే జిల్లా అటవీశాఖ తరపున చర్యలను మొదలుపెట్టామన్నారు. బస్సులను నిలిపివేయడం, పలుమార్లు కాశినాయన క్షేత్ర ప్రతినిధులు, సిబ్బందితో సంప్రదించామన్నారు. ఇటీవల భవనాల కూల్చివేత తరువాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు పునరుద్ధరణకు సంబంధించిన లిఖిత పూర్వకమైన ఆదేశాలు తమ శాఖకు అందలేదని వివరించారు.

విజేతలకు బహుమతులు పంపిణీ



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్

ఒంటిమిట్ట: అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఒంటిమిట్ట ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సాయి భారతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవులు ప్రాముఖ్యత, వాటి సంరక్షణ అవసరం, అటవీ చట్టాల పాత్ర తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ అడవులు వాతావరణ సమతుల్యతను కాపాడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామతులసీ, ఎఫ్ఎస్ఓ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయానికి బాంబు బెదిరింపు!

మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్న సిబ్బంది




కలెక్టర్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

రాయచోటి: కలెక్టర్ కార్యాలయాన్ని బాంబులతో పేల్చేస్తున్నట్లు దుండగుల నుంచి ఫోన్ సమాచారం అందింది. వెంటనే విషయాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయానికి తెలియపరిచారు. సమాచారం అందగానే జిల్లా బాంబు స్క్వాడ్, డాగ్స్ స్క్వాడ్‌లు కలెక్టర్ కార్యాలయంలో అణువణువు గాలింపు చేశాయి. కార్యాలయ సిబ్బంది అంతా ఒక్క మారుగా ఉలికిపాటుకు గురయ్యారు. తీరా ఇదంతా జిల్లా పోలీస్ యంత్రాంగం మాక్ డ్రిల్‌లో భాగమని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయానికి వస్తే శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో బాంబు బెదిరింపు వచ్చినపుడు ఎలా స్పందించాలనే దానిపై పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు.

ఉద్యోగుల అప్రమత్తత కోసం.....

ఉద్యోగులను అప్రమత్తం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో శిక్షణ ఇవ్వడమే మాక్ డ్రిల్ ఉద్దేశమని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బాంబు బెదిరింపు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎక్కడైనా ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో రాయచోటి పట్టణ సీఐ చలపతి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వీజే రామకృష్ణ, సీఐలు, ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ



కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పేరు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఉన్న వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడపజిల్లాగా మార్పు చేస్తూ జీఓ ఎంఎస్ నెంబరు 99 విడుదల చేశారు. ఏపీ డిస్ట్రిక్ట్ (ఫార్మేషన్) యాక్ట్-1974 ఆర్/డబ్ల్యు రూల్-4 ఆఫ్ ఏపీ డిస్ట్రిక్ట్ (ఫార్మేషన్) రూల్స్-1984 మేరకు ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ద్వారా కలెక్టర్ కార్యాలయానికి వచ్చాయి. ఈ మేరకు కలెక్టర్ ప్రాథమిక నోటిఫికేషన్‌ను జిల్లా గెజిట్‌లో ప్రచురించి ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలను ఆహ్వానించాలని ఆదేశించారు. 30 రోజుల్లో అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించి పంపాలని సూచించారు.

వైఎస్ఆర్ సేవలకు గుర్తింపుగా...

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేశారు.సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం చేశారు. కడప రిమ్స్, డెంటల్ కళాశాల, యోగి వేమన విశ్వవిద్యాలయం, స్పోర్ట్స్ స్కూలు, ఐటీ కార్ల్, ట్రిపుల్ ఐటీ తదితర ఎన్నో విద్య,వైద్యాలయాలు స్థాపించారు. 2009 సెప్టెంబరు 2వ తేదిన ఆయన ప్రమాదవశాత్తు మరణించారు. ఆయన సేవలకు గుర్తింపుగా నాటి ప్రభుత్వం 2009 అక్టోబరు 5వ తేదిన కడపజిల్లా పేరును డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాగా మార్పుచేస్తూ జీఓ విడుదల చేసి అభిప్రాయాలు, అభ్యంతరాలను కోరింది. ఆ తర్వాత 2010 జులై 7వ తేది వైఎస్సార్ జిల్లాగా మార్పు చేస్తూ జీఓ ఎంఎస్ నెం. 613 జారీ చేసింది. అప్పటి నుంచి వైఎస్సార్‌జిల్లాగా పిలుస్తున్నారు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పేరును తొలగించి వైఎస్సార్‌కడపజిల్లాగా మార్పు చేస్తూ జీఓ జారీ చేసింది.

క్లుప్తంగా

అరటి పంట దగ్ధం

– రూ.8లక్షల మేర పంట నష్టం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన అరటి తోట

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో విద్యుదాఘాతానికి ఐదు ఎకరాల అరటి పంట దగ్ధమైంది. సుమారు రూ.8లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు మొరుసు భారతి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ హెడ్ ఫీజు కాలిపోయి వాటి అగ్గి రవ్వలు పంటపై పడి పూర్తిగా కాలిపోయిందని ఆమె అన్నారు. రెండవ పంట కావడంతో ఎండుటాకులు ఉండటంవల్ల ఒక్కసారిగా పంటలు చెలరేగి గెలలతో ఉన్న అరటి తోట మొత్తం దహనమైందన్నారు. దీంతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కాలిపోయాయన్నారు. ప్రభుత్వం స్పందించి పేద రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కారు ఢీకొని చిన్నారి మృతి



మృతి చెందిన కీర్తన

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తూ కారు ఢీకొని గోవింద కీర్తన అనే చిన్నారికి తీవ్రంగా గాయపడి మృతి చెందింది. గ్రామంలోని ప్రత్యక్షసాక్షుల సమాచారం మేరకు ఉప్పలూరు గ్రామంలో ఓ వ్యక్తి ఇంట ఓ శుభకార్యం జరుగుతోంది. కార్యక్రమానికి పలువురు గ్రామస్తులు హాజరయ్యారు. 6 సంవత్సరాల కీర్తన అనే చిన్నారి ఇంటిముందు ఆడుకుంటూ ఉండగా కారు వేగంగా వచ్చి చిన్నారిని ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన చిన్నారిని ఓ ప్రైవేటు వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మృతి చెందింది.

ప్రైవేట్ బస్సు ఢీకొని హెడ్‌కానిస్టేబుల్ మృతి





మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణ, ప్రమాదానికి కారణమైన బస్సు

దువ్వూరు : మండలంలోని ఇడమడక చెక్ పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ బస్సు ఢీకొని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణ (55) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. జిల్లా సరిహద్దు అయిన ఇడమడక చెక్ పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున హెడ్‌కానిస్టేబుల్ బండి నారాయణ, ఇతర సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణకు తీవ్రగాయాలయ్యాయి. సిబ్బంది ఆయనను నంద్యాల జిల్లా చాగలమర్రిలోని కేరళ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయం

- పీఎంఎంవీవై కింద రూ. 5 వేల సాయం
- గర్భిణులకు మూడు విడతలుగా చెల్లింపు
- రెండవ కాన్పులో ఆడపిల్ల పుట్టినా పథకం వర్తింపు
- జిల్లా వ్యాప్తంగా 13256 మంది గర్భిణులు



గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న వైద్య బృందం



మహిళను పరీక్షిస్తున్న వైద్యుడు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై) పథకం మాతా శిశు సంరక్షణ కోసం దోహదపడుతోంది. పేద, మధ్యతరగతికి చెందిన గర్భిణులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఈ పథకాన్ని మొదట 2010లో నాటి కేంద్ర ప్రభుత్వం మాతృత్వ సహయోగ్ యోజన (ఐజీఎంఎస్‌వై) పథకంగా ప్రారంభించింది. అయితే ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక 2016లో ఈ పథకాన్ని ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజనగా మార్చారు. ఈ పథకం మరింత మందికి లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పథకాన్ని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి మరిన్ని మార్పులు చేసిన తర్వాత అమలులోకి తీసుకొచ్చారు. పీఎంఎంవీవై ద్వారా అందించే నగదు ప్రోత్సాహకాల ద్వారా గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్య కల్పనకు, నవజాతా శిశు సంరక్షణకు, వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.

నమోదు ప్రక్రియను నిరంతరం:

జిల్లాలో 13,256 మంది గర్భిణులను నమోదు చేశారు. వీరి అందిరికీ ఇప్పటివరకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. గర్భిణులకు వర్తింపజేసే విధంగా నమోదు ప్రక్రియను ఆరోగ్య సిబ్బంది నిరంతరం నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో గర్భిణుల గుర్తించి వైద్యశాఖ రికార్డుల్లో పొందుపరుస్తున్నారు. దీంతోపాటు గత మూడేళ్లగా నమోదు చేసుకుని చిన్నారుల తల్లులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు.

పీఎంఎంవీవై పథకానికి అర్హతలు :

- గర్భం దాల్చిన మూడు నెలల్లోపు పీఎంఎంవీవై పథకం కోసం వార్డు, గ్రామ సచివాలయంలోని వెల్‌నెస్ సెంటర్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
- గర్భిణులు తప్పనిసరిగా మదర్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డు కలిగి ఉండాలి.
- 19 సంవత్సరాలు నిండిన తర్వాత గర్భం దాల్చిన మహిళలకు ఈ పథకం వర్తిస్తుంది.
- పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతినెల 9వ తేదీన నిర్వహిస్తున్న పీఎంఎంవీవై శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలి.

నగదు చెల్లింపు ఇలా..

- గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం పూర్తయ్యేలోపు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా మూడు విడతల్లో రూ. 5 వేలు చెల్లిస్తుంది.
- మొదటి విడతగా అంగన్వాడీ కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో గర్భిణీగా నమోదైన వెంటనే రూ. 1000 లబ్ధిదారునికి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.
- ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా వైద్య పర్యవేక్షణ తీసుకున్న గర్భిణికి రెండవ విడతగా రూ. 2 వేలు అందజేస్తారు.
- ప్రసవం అయిన తర్వాత మూడవ విడతగా రూ. 2 వేలు చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవజాతా శిశువు తల్లుల సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన పీఎంఎంవీవై పథకాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతినెలా అర్బన్ హెల్త్ సెంటర్లలో గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. నిర్ణీత సమయంలో వివరాలు నమోదు చేసుకుని పథకం లబ్ధిని పొందాలి. ఇప్పటికే ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీలకు అవగాహన కల్పిస్తున్నాం. – దేవిరెడ్డి శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, కడప

విస్తృత ప్రచారం చేస్తున్నాం



పీఎంఎంవీవై పథకం ఆవశ్యకత గురించి, గర్భిణులకు కలిగే ప్రయోజనాలపై విరివిగా అవగాహన కల్పిస్తున్నాం. అర్హులందరికీ ఈ పథకం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. గర్భిణులను నమోదు చేసి ప్రతి ఒక్కరికీ ఎంసీపీ కార్డును అందజేస్తున్నాం. – సుజాత, ఏఎస్ఎం, కడప

సమర్థవంతమైన పౌరసేవలే ‘మిషన్ కర్మయోగి’ లక్ష్యం

– జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : భారతీయ నైతికతలో సమర్థవంతమైన పౌర సేవను సృష్టించే లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగులు ఓర్పు, నేర్పుతో ఉద్యోగ విధులు నిర్వహించే లక్ష్యంతో ‘మిషన్ కర్మయోగి’ ఆన్‌లైన్ అభ్యాస వేదికను ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సభాభవన్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ‘కర్మయోగి పోర్టల్’ నిర్వహణపై అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్వో విశ్వేశ్వర నాయుడు తోపాటు జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి హజరతయ్య హాజరై పోర్టల్ నిర్వహణపై పీపీటీ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డీఆర్వో మాట్లాడుతూ.. మిషన్ కర్మయోగి – నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ సివిల్ సర్వీసెస్ కెపాసిటీ బిల్డింగ్ (ఎన్‌పీసీఎస్‌సీబీ) సివిల్ సర్వీస్ అధికారులకు కర్మయోగి భారత్ పోర్టల్‌ను భారత ప్రభుత్వం అందిస్తుందన్నారు. మిషన్ కర్మయోగి న్యూ ఇండియా దార్శనికతకు అనుగుణంగా సరైన వైఖరి, నైపుణ్యాలు మరియు జ్ఞానంతో కూడిన భవిష్యత్తు నిర్మాణం కోసం పౌర సేవను నిర్మించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆకాంక్షిస్తున్నాయన్నారు. అధికారుల భవిష్యత్తును పటిష్టం చేసి దిశగా.. నిరంతరం ఎప్పుడైనా–ఎక్కడైనా నేర్చుకునేలా బలమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా పౌర సేవల సామర్థ్య నిర్మానాత్మక వ్యూహంగా మార్చడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. కర్మయోగి భారత్ దార్శనికత, భారత పౌర సేవల సామర్థ్య నిర్మాణ దృశ్యాన్ని మార్చడం, తద్వారా అధికారులు భవిష్యత్తులో సిద్ధంగా ఉండటానికి, ఎప్పుడైనా–ఎక్కడైనా నిరంతర అభ్యాసాన్ని అనుమతించే బలమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. కర్మయోగి పోర్టల్‌ను ప్రతి ఉద్యోగి, అధికారి సీఎఫ్ఎంఎస్ లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌ని ఉపయోగించి లాగిన్ చేసుకోవాలన్నారు. మిషన్ కర్మయోగి ప్రభుత్వం–పౌరుల మధ్య పరస్పర చర్యను పెంపొందించడం, అధికారులు పౌరులకు మరియు వ్యాపారానికి సహాయకులుగా మారడం, ప్రవర్తనా–కార్యాచరణ–డొమైన్ సామర్థ్యాల అభివృద్ధి ద్వారా జీవన సౌలభ్యం మరియు వ్యాపార సౌలభ్యానికి దారితీస్తుంది. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ హరనాథ్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

ఉగాది పురస్కారాలకు ఎంపిక

- హోంశాఖ పరిధిలోని అన్ని విభాగాల వారిగా అవార్డులు
- వైఎస్ఆర్ జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బందికి పురస్కారాలు





సేవాపతకంకు ఎంపికైన ఏసీబి ఏఎస్ఐ కె. మనోహర్ వర్మ, ఐ. ధర్మారావు, జిల్లా అగ్నిమాపక అధికారి, కడప

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖ తరపున పోలీసు, విజిలెన్స్, ఫైర్, ఇతర విభాగాలలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి ‘ఉగాది’ పురస్కారాలను ప్రకటించింది. ఈ అవార్డులను ఈ ఏడాది నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర ఆవతరణ దినోత్సవం రోజున అందుకోనున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో వివిధ కేటగిరిలకు చెందిన వారు ‘ఉగాది పురస్కారాల’ అవార్డులకు ప్రకటితమైన వారి వివరాలిలా వున్నాయి.

అవార్డు పొందిన అధికారి	విభాగం	అవార్డు కేటగిరి
నాగల లక్ష్మమయ్య(హెచ్.సి)	11వ ఏపిఎస్‌పి బెటాలియన్, భాకరాపేట	మహోన్నత సేవాపతకం
కె. మనోహర్ వర్మ (ఏ.ఎస్.ఐ)	ఏ.సి.బి, కడప	మహోన్నత సేవాపతకం
శివశంకరయ్య	ఏఎస్ఐ, కడప ఒన్‌టౌన్	ఉత్తమ సేవాపతకం
రమణారెడ్డి (ఆర్ఎస్ఐ)	11వ బెటాలియన్	ఉత్తమ సేవాపతకం
నాగేశ్వరప్ప, అడిషనల్ కమాండెంట్	11 బెటాలియన్	ఉత్తమ సేవాపతకం
పోలీసు కఠిన సేవాపతకంను పొందిన వారు		
ఎం. నాగభూషణ్	కడప తాలూకా సీఐ (గతంలో)	
రామోహన్	ఆర్ఎస్ఐ	11వ బెటాలియన్, భాకరాపేట
సుబ్బరాయుడు	ఆర్ఎస్ఐ	11వ బెటాలియన్, భాకరాపేట
అనిల్‌కుమార్	ఇన్స్‌పెక్టర్	కడప జోన్ ఇంటలిజెన్స్
శేషశయనరావు	ఏఎస్ఐ	కడప
మురళీయాదవ్	ఏఎస్ఐ	కలసపాడు
వెంకటరమణయ్య	హెడ్‌కానిస్టేబుల్	రిమ్స్ పిఎస్, కడప
వెంకటరత్నం	ఏ.ఆర్ హెడ్‌కానిస్టేబుల్	డి.ఏ.ఆర్
సునీల్	కానిస్టేబుల్	చాపాడు
గురవయ్య	ఏఆర్ పీసీ	డిఏఆర్, కడప
చక్రపాణి	హెచ్‌సీ	11వ బెటాలియన్, భాకరాపేట
సుబ్బారెడ్డి	హెచ్‌సీ	11వ బెటాలియన్, భాకరాపేట
నాగార్జునయ్య	హెచ్ సీ	11వ బెటాలియన్, భాకరాపేట
లక్ష్మయ్య	హెచ్‌సీ	11వ బెటాలియన్, భాకరాపేట
సుబ్బరాయుడు	ఏఆర్ ఎస్ఐ	11వ బెటాలియన్, భాకాపేట

బెంగళూరులో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి



తనపై జరిగిన దాడిని పోలీసులకు వివరిస్తున్న బాధిత డ్రైవర్ ఎస్ఆర్ఎస్ రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ /బనశంకరి : కేఎస్ఆర్‌టీసీ బస్ డ్రైవరు రాంగ్ రూట్లో వచ్చి ఏపీఎస్ఆర్‌టీసీ బస్ డ్రైవరుపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన బెంగళూరులోని ఉప్పారపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కెంపేగౌడ బస్టాండు టెర్మినల్ –3లో గురువారం రాత్రి 10.30 సమయంలో మైసూరు రోడ్డు డిపో–6 కు చెందిన కేఎస్ఆర్‌టీసీ బస్ డ్రైవరు హనుమంతు చలవాది బస్‌ను డిపోలోకి రాంగ్‌రూట్లో తీసుకెళ్లాడు. డిపోలో పార్కింగ్ స్థలంలో ఏపీఎస్ఆర్‌టీసీ ప్రొద్దుటూరు డిపో బస్ ఉండటంతో పక్కకు తీయమని తెలిపారు. ఆ సమయంలో కేఎస్ఆర్‌టీసీ డ్రైవరు హనుమంతు చలవాది, ప్రొద్దుటూరు డిపో డ్రైవరు నరాల రవిశంకర్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన కేఎస్ఆర్‌టీసీ డ్రైవరు హనుమంతు చలవాది, నరాల రవిశంకర్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని తక్షణం మల్లిగె ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఉప్పారపేట పోలీస్ స్టేషన్‌లో డ్రైవరు నరాల రవిశంకర్‌రెడ్డి కేఎస్ఆర్‌టీసీ డ్రైవరు హనుమంతు చలవాదిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేఎస్ఆర్‌టీసీ ఉన్నతాధికారులు కేఎస్ఆర్‌టీసీ డ్రైవరు కమ్ కండక్టర్ హనుమంతు చలవాదిని సస్పెండ్ చేశారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే శుక్రవారం ఆర్‌టీసీ రీజనల్ చైర్మన్, బోర్డు డైరెక్టర్ పూల నాగరాజు దాడికి గురైన డ్రైవరు నరాల రవిశంకర్‌రెడ్డిని ఆసుపత్రిలో పరామర్శించారు. ఆస్పత్రి వైద్యం ఖర్చులను ఏపీఎస్ఆర్‌టీసీ భరిస్తుందని హామీ ఇచ్చారు.

బాధిత డ్రైవర్‌ను అన్ని విధాల ఆదుకుంటాం

బెంగుళూరు బస్టాండు పాయింట్‌లో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రొద్దుటూరు డిపో డ్రైవర్ ఎస్ఆర్ఎస్ రెడ్డిని అన్ని విధాల ఆదుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ఎండీ, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని మీడియాకు వివరించారు. బెంగుళూరులో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌ను అలెర్ట్ చేసి బాధిత డ్రైవర్‌కు అండగా నిలబడాలని సూచించామన్నారు. ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ బెంగుళూరుకు వెళ్లి సమగ్రంగా విషయాలు తెలుసుకున్నారన్నారు. బాధిత డ్రైవర్‌కు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కడప ఈడీకి సూచించినట్లు వివరించారు. అంతేకాకుండా బాధిత డ్రైవర్ వైద్యానికి సంబంధించి మొత్తం ఖర్చును ఆర్టీసీ సంస్థ భరిస్తుందని ఆర్ఎం తెలియజేశారు. కర్ణాటక డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని తెలిపారు. రాష్ట్రాలు వేరైనా అందరూ సోదరభావంతో మెలగాలని ఆయన డ్రైవర్లకు పిలుపునిచ్చారు.

మెడికల్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



జనతా మెడికల్ స్టోర్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కడప అర్బన్ : ‘ఆపరేషన్ గరుడ’లో భాగంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈగల్ డ్రగ్స్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం మందుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల పరంగా ఈ దాడులను కొనసాగిస్తున్నారు. కడప నగరంలోని జనతా మెడికల్ స్టోర్ లో విజిలెన్స్ అధికారి శ్రీనివాసరావు, డ్రగ్ ఇన్స్పెక్టర్ మాధవి ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు డాక్టర్ పర్యవేక్షణలోనే, వారి ప్రిస్క్రిప్షన్‌ల మేరకు మాత్రమే నార్కోటిక్ మందులు వినియోగించాల్సి ఉంటుందని, అయితే కొంతమంది యువత డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు ట్యాబ్లెట్లు తీసుకొని మత్తులో జోగుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. మెడికల్ దుకాణాల్లో మత్తుమందులు ఏవైతే ఉన్నాయో, ఆ మందులను యువత కొనుగోలు చేసి సేవిస్తున్నారన్నారు.. వివిధ కాంబినేషన్లోని మందులు మానసిక రుగ్మతలు ఉన్న రోగులకు, కొన్ని రకాల జబ్బులు నయమయ్యేందుకు మాత్రమే వీటిని వినియోగించాల్సి ఉంటుందన్నారు. కొందరు యువత డాక్టర్ అనుమతి లేకుండానే మత్తు టాబ్లెట్లు కొనుగోలు చేస్తున్నారన్నారు. వీటిని సేవించడం వల్ల యువత నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కడపలో జనత మెడికల్ స్టోర్‌లో తనిఖీలు నిర్వహించామని అయితే ఇక్కడ మందులు కొనుగోలు విక్రయాలు స్టాకు వివరాలపై వ్యత్యాసం ఉందన్నారు. మెడికల్ స్టోర్స్ నిర్వాహకులకు, మెడికల్ రెప్స్‌కు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ శంకర్ రెడ్డి, అగ్రికల్చర్ అధికారి బాలగంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతికి సంతాపం

కడప అర్బన్/మైదుకూరు : జిల్లాలోని దువ్వూరు పరిధిలోని ఇడమడక చెక్ పోస్ట్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణ మృతి పట్ల జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ప్రగాఢ సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే సిబ్బంది అకాలమరణం పొందడం బాధాకరమన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కేశిలింగాయపల్లిలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు:

హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణ పార్థివ దేహానికి మైదుకూరు సమీపంలోని స్వగ్రామం కేశిలింగాయపల్లిలో ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ పి బి.రమణయ్య, ఏ.ఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పేదల బియ్యం స్వాహాపై కొనసాగుతున్న విచారణ

డీలర్‌ను, వీఆర్‌ఓను తప్పించే ప్రయత్నం

కలసపాడు : పేదల బియ్యం స్వాహా వ్యవహారంలో మండల రెవెన్యూ అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఈ నెల 20వ తేదీన ‘పేదల బియ్యం పక్కదారి’ అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు పేదల బియ్యాన్ని స్వాహా చేసిన వ్యవహారంలో అసలు స్వాహా చేసిన వారిని తప్పిస్తూ గ్రామ వీఆర్ఏను నిందితుడిని చేసే ప్రయత్నం చేస్తున్నారు. కర్ణంవారిపల్లె రేషన్ షాపు నెంబర్ 6లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టిన అధికారులు స్వాహా చేసిన వారిని వదిలేసి వీఆర్ఏగా పనిచేస్తున్న సరోజనను స్వాహా చేసిన వారిలో చేర్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. కేవైసీ లేని లబ్ధిదారులకు గ్రామ రెవెన్యూ అధికారి ఈకేవైసీ వేసి రేషన్ షాపు డీలర్ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ రేషన్ షాపు అథెంటికేషన్ వ్యవహారంలో వీఆర్‌ఓనే బయోమెట్రిక్ వేసినట్లు అధికారులు తేల్చినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారంలో అసలు వీఆర్ఏ ప్రమేయం లేకుండానే ముందుగా తయారు చేసిన వేలిముద్రలు వేసి ప్రతి నెలా 6.50 క్వింటాళ్ళ బియ్యం స్వాహాకు రేషన్ డీలర్ పాల్పడినట్లు సమాచారం. అధికారుల విచారణలో అసలు స్వాహా చేసిన రేషన్‌షాపు డీలర్, వీఆర్‌ఓను తప్పించి గ్రామ వీఆర్ఏను బలిపశువును చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా మండలంలోని పలు రేషన్ షాపులకు వీఆర్ఏ అథెంటికేషన్ వేసినట్లు రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. అయితే ఆమె ప్రమేయం లేకుండా బోగస్ వేలిముద్రలతో రేషన్‌షాపు డీలర్లు ఈకేవైసీ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో బియ్యాన్ని స్వాహా చేసింది రేషన్ డీలరా? వీఆర్ఏనా? వీఆర్ఏ అయితే ఆమెకు అంత అవగాహన లేదు. ఇదంతా డీలర్ చేసిన వ్యవహారం. మండలంలోని ఇతర రేషన్‌షాపుల్లో మృతిచెందిన వారి రేషన్ బియ్యాన్ని కూడా రేషన్ షాపు 6లో వీఆర్ఏ అథెంటికేషన్‌తో స్వాహా చేశారు. ఇలా చేయాలంటే ఆయా రేషన్‌షాపుకు సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారి వేలిముద్రతోనే బియ్యాన్ని పంపిణీ చేయవచ్చు. దీనికి భిన్నంగా వీరు అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. జిల్లా రెవెన్యూ అధికారులు విచారణ సమగ్రంగా జరిపి మండలంలో రేషన్ బియ్యం స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సింధూజను వివరణ కోరగా డీలర్ అవినీతికి పాల్పడలేదని, వీఆర్ఏ అథెంటికేషన్ ద్వారా స్వాహా చేశారని తెలిపారు.